www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 నవంబరు 2022

5

పశ్చిమ గోదావరి

కూలీలందరికీ ఉపాధి పనులను కల్పించాలి

ప్రజాశక్తి - యలమంచిలి

గ్రామీణ ప్రాంతా ల్లోని ఉపాధి కూలీలందరికీ వెంటనే పనులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చించినాడ గ్రామంలో జరుగుతున్న పార్టీ కార్యకర్తల శిక్షణ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక గ్రామాల్లో పనుల్లేక కూలీలు సతమత మౌతున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి పనులు కల్పించడంతోపాటు, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి, కుటుంబానికి రెండు వందల రోజుల పనులు కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాతిరెడ్డి జార్జి, సీనియర్ నాయకులు వలవల శ్రీరామ్మూర్తి, కేతా సూర్యారావు, మాసవరపు సుబ్బారావు, పల్లి జార్జిబాబు, ఇంజేటి శ్రీనివాస్, జిల్లెళ్ల ప్రశాంతి పాల్గొన్నారు.

గొంతు తడిసేనా..!

వాటర్‌గ్రిడ్ పథకంపై జనాల్లో తీవ్రమైన చర్చ
మూడేళ్ల క్రితం గోదావరి నుంచి తాగునీటి పైప్‌లైన్ ప్రణాళికలు
ఎట్టకేలకు ఈనెల 21న శంకుస్థాపన చేసిన సిఎం
రూ.3,200 కోట్ల అంచనాల నుంచి రూ.1400 కోట్లకు కుదింపు
ఇంకా పూర్తికాని సర్వే పనులు
ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేనట్టే
డెల్టాలో కలుషిత నీటితో జనం అవస్థలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పసర్లు కమ్మిన నీటిని వాటర్ బాటిల్స్‌లో చూపిస్తూ ఈ నీటిని మనుషులు తాగుతారా'.. అంటూ 2019 ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా జిల్లాలో పర్యటించిన జగన్ అప్పటి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా గోదావరి నుంచి పైప్‌లైన్ వేసి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఉమ్మడి జిల్లాలోని ప్రజానీకానికి ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ హామీఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటర్ గ్రిడ్ పథకంపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు హడావుడి సైతం చేశారు. రూ.3,200 కోట్ల అంచనాతో ప్రణాళికలు సైతం రూపొందించారు. గోదావరిపై ఐదు చోట్ల పాయింట్లు రూపొందించి వాటికి అనుసంధానంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలు తయారు చేశారు. తర్వాత వాటర్‌గ్రిడ్ పథకం గురించి పట్టించుకునే వారే లేకపోయారు. వైసిపి అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచింది. ఎట్టకేలకు ఈనెల 21న నరసాపురంలో జరిగిన సిఎం పర్యటనలో వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేసిన పరిస్థితి నెలకొంది. శంకుస్థాపన జరిగినప్పటికీ వాటర్‌గ్రిడ్ ఇప్పట్లో పూర్తయ్యి జనాలకు తాగునీరు అందే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాటర్ గ్రిడ్ పథకం వర్తింపచేస్తూ రూపొందించిన ప్రణాళికలను పూర్తిగా మార్చేశారు. ఇప్పుడు డెల్టాలోని మండలాల్లో మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేసేవిధంగా మార్పుచేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 18 మండలాలు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలో ఎనిమిది మండలాలు మొత్తం 26 మండలాలకు పరిమితం చేశారు. బడ్జెట్ సైతం రూ.1400 కోట్లకు కుదించారు. ఆక్వా సాగు కారణంగా డెల్టాలో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. దీంతో ముందుగా డెల్టాకైనా నీరందిస్తే చాలని అంతా భావించారు. ఇప్పట్లో మాత్రం జనాలకు వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు అందే పరిస్థితులు మాత్రం కనిపించడం లేదు.

ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేనట్టే

మూడున్నరేళ్లుగా వాటర్‌గ్రిడ్ పథకాన్ని పట్టించుకోని వైసిపి సర్కార్ మూడున్నరేళ్ల తర్వాత శంకుస్థాపనకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రభుత్వ పాలన మరో ఏడాదిన్నర ఉంది. ఇప్పటి వరకూ వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించిన సర్వే పనులు పూర్తికాని పరిస్థితి. దీన్నిబట్టి చూస్తే ఇప్పట్లో వాటర్ గ్రిడ్ పథకం పనులు పూర్తయ్యే పరిస్థితిలేదని స్పష్టమవుతోంది. సర్వే పనులు పూర్తవడమే గగనమన్న చర్చ సాగుతోంది. ఇప్పట్లో డెల్టా ప్రజానీకానికి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందే పరిస్థితి లేదని స్పష్టమవుతోంది. ఆక్వాసాగుతో తాగునీరు పూర్తిగా కలుషితమవడంతో డెల్టా ప్రజానీకం ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే 20 లీటర్ల తాగునీరు ఉచితంగా అందిస్తామంటూ హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన తర్వాత ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. పలుచోట్ల వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు లెక్కలు చెప్పినా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడలేదు. 2019 ఎన్నికల్లో తాగునీటిపై వైసిపి ఇచ్చిన వాటర్‌గ్రిడ్ హామీ సైతం నేటికీ నెరవేరలేదు. దాదాపు దశాబ్దకాలంగా డెల్టా ప్రజానీకం కొనుగోలు చేసిన తాగునీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప స్వచ్ఛమైన తాగునీరు మాత్రం అందించని పరిస్థితి నెలకొంది. కలుషిత నీటితో జనం రోగాలు భారీన పడుతున్నారు. తాగునీటి సమస్య ఎప్పటికి తీరుతుందోనంటూ జనం ఎదురుచూస్తున్నారు.

సహకార రంగాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ప్రభుత్వాలు

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ రైతులకు సహకార సంఘాలను దూరం చేస్తున్నాయని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మహాసభ శనివారం తాడేపల్లిగూడెం గుణ్ణం ఫంక్షన్ హాలులో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో జిల్లాల విభజన వల్ల మూడు జిల్లాలు మూడు కమిటీలను ప్రకటించారు. ఈ మూడు కమిటీలకు ఆయా జిల్లాల సిఐటియు నాయకులు గౌరవ అధ్యక్షులుగా ఉండనున్నారు. ప్రతీ బ్రాంచ్ నుండి ఒక డైరెక్టర్‌ను ఎన్నుకోనున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాబ్జీ మాట్లాడుతూ సహకార చట్టానికి తీసుకువచ్చిన సవరణలు శాసనమండలిలో కనీసం చర్చకు కూడా పెట్టకుండా ఆమోదించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార రంగాన్ని కాపాడుకునేందుకు ఉద్యోగులు, రైతులు ఐక్యంగా పోరాడాలన్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ, సహకార చట్టాల్లో రైతులకు ప్రాధాన్యతను తగ్గిస్తూ 50 శాతం ప్రయివేటు వారికి అవకాశం కల్పించడం సహకార రంగాన్ని నాశనం చేయడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షులు పి.వి.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న హెచ్‌ఆర్‌సి పాలసీని మొత్తం ఉద్యోగులందరికీ అమలయ్యేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు ఉద్యోగులందరూ ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కోశాధికారి టి.వెంకటరామయ్య మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీలో ఉన్న అంశం గురించి అలాగే పదవీ విరమణ వయసును సంఘ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఈ మహాసభలో సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సొసైటీ ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకులు టి.గంగరాజు, తూర్పుగోదావరి జిల్లా నాయకులు ఆదినారాయణ, జిల్లా కన్వీనర్ పివి.నరసింహారావు, నాయకులు మాట్లాడారు.

21 రోజుల్లో ధాన్యం సొమ్ము జమ : జెసి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని శివదేవునిచిక్కాల, దగ్గులూరు, లంకలకోడేరు - 1, 2 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, గ్రామ సచివాలయాలను, లంకలకోడేరు వెంకట సాయి రైస్ మిల్లును జిల్లా జాయింటు కలెక్టర్ జెవి మురళీ శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే నగదు జమ చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం రవాణాకు లారీలను సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం రవాణాను ప్రభుత్వం చేపడితే ఏజెన్సీకి రవాణా ఖర్చులు చెల్లిస్తామని, రైతే స్వయంగా రవాణా చేస్తే గోనె సంచులు, హమాలీలను ఏర్పాటు చేసుకుంటే ధాన్యం డబ్బుతో పాటు సదరు ఖర్చులను కూడా రైతు ఖాతాలో నేరుగా జమ చేస్తామన్నారు. ఇప్పటికే ఆర్‌బికెల్లో గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం లంకలకోడేరు శ్రీవెంకట సాయి రైస్ మిల్లులో రికార్డులను పరిశీలించారు. అక్కడ ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అబ్దుల్ రహీమ్, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, రెవెనూ సిబ్బంది పాల్గొన్నారు.

వికటించిన మధ్యాహ్న భోజనం

ఉమ్మడి జిల్లాలో 36 మంది విద్యార్థులకు అస్వస్థత - నిలకడగా ఆరోగ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

వారంతా ఎప్పటిలాగానే ఉదయం పాఠశాలకు వెళ్లారు. రోజు మాదిరిగానే పాఠశాలలో వండిన భోజనాన్ని తిన్నారు. అయితే కొద్దిసేపటి తర్వాత ఉన్నట్టుండి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విద్యార్థులను అంబులెన్స్‌లో ఉపాధ్యాయులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఒక్కసారి గ్రామంలో ఆందోళన నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురై కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన మండల కేంద్రమైన పాలకోడేరులో శనివారం చోటుచేసుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరు-1 ప్రాథమిక పాఠశాలలో ఒకటి ఐదో తరగతి వరకూ 180 మంది విద్యార్థులు చదువుతున్నారు. జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం శనివారం గ్రీన్ రైస్ (పుదీనా, కొత్తిమీర అన్నం) పెట్టారు. 116 మంది విద్యార్థులు ఈ ఆహారం తిన్నారు. వీరిలో 21 మందికి ఆహారం వికటించి అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో స్థానికంగా బయందోళన నెలకొంది. వెంటనే విద్యార్థులను స్థానిక పిహెచ్‌సికి తరలించారు. ఆరుగురు విద్యార్థులకు కడుపునొప్పి రావడంతో వారికి మెరుగైన సేవలందించారు.

పుదీనా, కొత్తిమీర ఎక్కువ పరిమాణాల్లో వేయడం వల్ల విద్యార్థులకు వికారం ఏర్పడి అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే విద్యార్థులకు చికిత్స అందించి ఇళ్లకు పంపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ పాలకోడేరులో శనివారం రాత్రి పర్యటించారు. స్థానికంగా ఉన్న పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు నుంచి వివరాలు సేకరించారు. భోజన శాంపిల్స్ ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి ఇబ్బంది లేదన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను దగ్గరుండి పరీక్షించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. అవసరమైతే మరిగ్గైన వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు : తల్లిదండ్రులు

స్థానిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యంగా ఉండట్లేదని ఉపాధ్యాయులకు, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. భోజనం నాణ్యంగా ఉండటం లేదని చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇంటి నుంచి భోజనాన్ని తీసుకెళ్తున్నారని, కొన్ని పరిస్థితుల్లో పాఠశాలలో తింటున్నారని చెప్పారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు వైద్యులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.

ఏలూరు జిల్లా పెదవేగిలో: పెదవేగి మండలం కూచింపూడి జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం తిన్న 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిమాదిరిగానే శనివారం కూడా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా కుచింపూడిలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఏడోతరగతి విద్యార్థులు భోజనాలు చేశారు. వారు భోజనాలు చేసిన కొద్దిసేపటికే ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకోగా, మరో 13 మంది కడుపునొప్పితో బాధపడ్డారు. విషయం తెలుసుకున్న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుటాహుటిన విద్యార్థులను పెదవేగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారికి వైద్యసేవలందించారు. వెంటనే జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.

భోజనం తిన్న విద్యార్థి నుంచి వివరాలు సేకరిస్తున్న డిఆర్‌ఒ

ఆహారానికి సంబంధించిన శాంపిల్స్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించాలని తహశీల్దార్ నాగరాజును ఆదేశించారు. విద్యార్థులు తిన్న ఆహారాన్ని విశాఖపట్నంలోని ల్యాబ్‌కు పంపించినట్లు తహశీల్దారు నాగరాజు తెలిపారు. అక్కడ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలుంటాయని తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.రవిని, డాక్టర్ మాధవిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ప్రధానోపాధ్యాయుడు సురేష్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. చికిత్స అనంతరం విద్యార్థినులకు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను మూడు రోజులు పాటు అందించాలని డాక్టర్‌ను ఆదేశించారు. ఆహారం తినడం వల్ల ఇలా అయిందా? లేక వేరే ఏమైనా కారణాలున్నాయా? అనేదానిపై విచారిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 230 మంది విద్యార్థులుండగా 15 మందికి ఇలా కావడంపై కూడా ఆరా తీస్తున్నారు.

పరామర్శించిన ఎమ్మెల్యే అబ్బాయిచౌదరి

విషయం తెలుసుకున్న దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చేరుకున్నారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.

పేదల అభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు

భూ హక్కు పత్రాలు అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - తణుకురూరల్

పేద ప్రజలు అభివృద్ధి చెందాలనే చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం తేతలిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.10 లక్షలతో నిర్మించిన వైఎస్‌ఆర్ సుజల స్రవంతి ఆర్‌ఒ వాటర్ ప్లాంట్, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎవరైనా ఏదైనా పని అవసరం ఉంటే ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలకు నాయకులను తీసుకెళ్లి పని చేయించుకునేవారని, ప్రస్తుతం ఏ గ్రామంలో సమస్య వస్తే ఆ గ్రామంలోనే సమస్యను పరిష్కరించే విధంగా అన్ని కార్యాలయాలు అందుబాటులో ఉండే విధంగా సచివాలయ వ్యవస్థ ఏర్పడిందని అన్నారు. పేద పిల్లలందరూ చదువుకునేందుకు వారికి వివిధ పథకాలు అందించి వారిని ప్రోత్సహించిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉండేవని, పేదలు మాత్రమే ఆ పాఠశాలలకు వెళ్లే వారని, గమనించిన ముఖ్యమంత్రి ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకోవాలనే ఉద్దేశంతో నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేశారని తెలిపారు. తణుకు నియోజకవర్గ శాసనసభ్యులు కారుమూరి వెంకటనాగేశ్వరరావు మాట్లాడుతూ తేతలి ముఖ్యమంత్రి వచ్చిన తరువాత ఈ 3 సంవత్సరాల్లో 9,086 మందికి సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. జగన్ ప్రభుత్వం అభివృద్ధికి రూ.46 కోట్ల 76 లక్షలు ఖర్చుపెడితే, టిడిపి హయాల్లో రూ.2 కోట్ల 13 లక్షలు ఐదు సంవత్సరాల్లో ఖర్చుపెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఛైర్మెన్ గుబ్బల తమ్మయ్య, వైసిపి నాయకులు పోలేపల్లి వెంకటప్రసాద్, సుబ్బరాజు, భరణిప్రసాద్, గ్రామ సర్పంచి సరెళ్ల క్రాంతిప్రియ, సతీష్, జెసి జెవి మురళి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ పాల్గొన్నారు.

సబ్‌రిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

నిలిచిన రిజిస్ట్రేషన్లు - నిరాసతో వెనుతిరిగిన కక్షిదారులు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న తహశీల్దార్ ఎమ్‌డి పజిల్ పాషా, సిబ్బంది

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదేశాల మేరకు తహశీల్దార్ ఎమ్‌డి ఫాజిల్ పాషా, డిప్యూటీ తహశీల్దార్ బెజవాడ సీతారత్నంతో కలిసి శనివారం ఉతనిఖీలు చేపట్టారు. కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ 22ఎ అసైన్డ్ భూముల కార్యకలాపాలపై తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కొప్పర్రు, ఎల్‌బిచర్ల, మల్లవరం, చిట్టవరం, కె.బేతపూడి గ్రామాల పరిధిలో సుమారు రెండు నెలల నుంచి జరిగిన రిజిస్ట్రేషన్లు పరిశీలించారు. 22ఎలో ఉన్న నిషేధిత భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సబ్‌కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటివరకు నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూముల వివరాల్లో ఎటువంటి అవినీతి బయటపడలేదని చెప్పారు. ఈ తనిఖీలకు సబ్ రిజిస్ట్రార్ ఎం.వీరభద్రరావు పూర్తి సహకారం అందించినట్లు చెప్పారు.

కార్యాలయంలో తనిఖీలతో కక్షిదారుల ఇబ్బందులు..

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టడంతో భూ రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు కక్షిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి కార్యాలయం లోపల తనిఖీలు జరుగుతుండడంతో రిజిస్ట్రేషన్లు జరగక కార్యాలయం బయట కక్షిదారులు పడిగాపులు కాశారు. మధ్యాహ్నం నుంచి అయినా రిజిస్ట్రేషన్లు జరుగుతాయేమోనని ఆశతో కార్యాలయం బయట వేచి చూశారు. అయితే రిజిస్ట్రేషన్లు ఈరోజు ఉండవని, సోమవారం రావాలని కార్యాలయ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చినవారు నిరాశతో వెను తిరిగారు.

నాగహారిక మృతికి కారకులను శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - తణుకురూరల్

ముద్దాపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి నాగహారిక అనుమానాస్పదంగా మృతి చెంది 14 రోజులైనా దోషులను అరెస్టు చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముళ్లపూడి శ్రీనివాస్ తన మొదటి భార్య ఈ విధంగానే చనిపోయిందని, కూతురు నాగహారిక కూడా చనిపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుందని, గ్రామస్తులు కూడా అదే అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సవతి తల్లి రూపారాణి వైసిపి నాయకురాలు కావడం వల్ల ఈ నేరాన్ని తప్పించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, నాగహారిక మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆమె కోరారు. లేని పక్షంలో ఐద్వా మహిళా సంఘంగా తామే ముందుకు రావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కె.పద్మజ, కొత్తూర్తి నాగరత్నం పాల్గొన్నారు.

ఉద్దండ యోధుడు ఉద్దరాజు రామం

నేడు 28వ వర్థంతి

ప్రజాశక్తి - పశ్చిమడెస్క్

జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన యోధుడు ఉద్దరాజు రామం. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే జాతీయోద్యమంలోకి దూకారు. కాంగ్రెస్ నాయకుడిగా పోరాడిన రామం అనంతర కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర నేతగా పీడిత ప్రజల విముక్తి కోసం, సమ సమాజ నిర్మాణం కోసం జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు. ఆయన స్వగ్రామం పాలకొల్లు సమీపంలోని వాలమర్రు.

రామం అతి చిన్న వయస్సులోనే 1930లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని తొమ్మిది నెలల కారాగార శిక్ష అనుభవించారు. ఇనుమడించిన ఉత్సాహంతో 1931లో విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలోనూ, రీసెటిల్‌మెంట్ సమయంలో దండు నారాయణరాజుతో కలిసి పాల్గొన్నారు ఘోషా పద్ధతికి స్వస్తి చెప్పి తన సతీమణి మాణిక్యాంబను రాజకీయోద్యమాల్లోకి తీసుకొచ్చారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో ఆమె సైతం పది నెలలు కారాగార శిక్ష అనుభవించారు. 1932లో జరిగిన శాసనోల్లంఘనోద్యమంలో రామం రహస్య జీవితాన్ని గడుపుతూ వీరభారతి పత్రిక నిర్వహణకు తోడ్పడ్డారు.

1930లోనే రామంకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరైన సుందరయ్యతో పరిచయం ఏర్పడింది. కమ్యూనిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించారు. 1934లో రామం కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. కాంగ్రెస్ కార్యకలాపాలు సాగిస్తూనే యువకులను సంఘటితపర్చడంలో ప్రముఖ కషి సాగించారు.

1935లో పశ్చిమగోదావరి జిల్లా యువజన సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికై, యువకుల్లో రాజకీయ చైతన్యాన్ని, నూతనోత్సాహాన్ని నింపారు. 1938-39లో కాళీపట్నం రైతులు తమ హక్కుల కోసం పోరాటం సాగించారు. ఆ పోరాటానికి రామం నాయకత్వం వహించారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైనప్పటి నుంచి కూలి సంరక్షణ సంఘాలను నెలకొల్పడానికి కృషి చేశారు. రైతుకూలి ఉద్యమాలను నిర్మించి జిల్లా, రాష్ట్ర రైతు సంఘాల్లో బాధ్యాతాయుత స్థానాలను నిర్వహించారు. రెండో ప్రపంచయుద్ధం ప్రారంభం కావడంతో కమ్యూనిస్టులను బ్రిటీష్ ప్రభుత్వం వేటాడటం ప్రారంభించింది. దీంతో ఆయన 1940 నుంచి మూడేళ్లపాటు పోలీసులకు చిక్కకుండా కమ్యూనిస్టు కార్యకలాపాలు నిర్వహించారు. 1942లో వారంటు రద్దవ్వగానే రామం బయటకొచ్చారు. అయితే బ్రిటీష్ ప్రభుత్వం కక్షబూని 1943 జనవరి నుంచి 1944 జనవరి వరకూ నిర్బంధించింది. జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ అభివద్ధికి కృషి చేశారు.

నిర్బంధాలు అధిగమించి.. ఉద్యమాలు నిర్మించి..

స్వాతంత్ర్యానంతరం 1948లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రాలో ఘోర నిర్బంధ విధానం ప్రారంభించగానే రామం అజ్ఞాతంలోకి వెళ్లి 1952 వరకూ అనేక కష్టాలకోర్చి రహస్యంగా పని చేశారు. 1962 ఆఖర్లో ఇతర కమ్యూనిస్టు నాయకులతోపాటు రామంను నిర్బంధించి ఎనిమిది మాసాలు జైల్లో పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1964 డిసెంబర్ 30న దేశరక్షణ చట్టం కింద డిటెన్యూగా చేసి అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ఆయన్ని 15 మాసాలకుపైగా జైల్లో పెట్టింది. జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి అనారోగ్యాన్ని లెక్కచేయక నిర్విరామంగా పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో పాల్గొంటూనే ఉన్నారు. 1935-51 మధ్య కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కొంతకాలం అఖిల భారత కంట్రోల్ కమిషన్ సభ్యులుగా ఉన్నారు. చాలా కాలం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. 1975 జూన్‌లో అత్యవసర పరిస్థితి విధించబడి పార్టీ నాయకులు మీసా కింద నిర్బంధంలోగాని, రహస్య జీవితంలోగాని ఉండాల్సి వచ్చినప్పుడు రామం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కమిటీ బాధ్యతలను నిర్వహించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో రామం నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 35 వేల ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక సమస్యలను రామం పార్లమెంట్లో ప్రస్తావించారు. 1977, 1980 పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆయన ఈ స్థానం నుంచి పోటీ చేశారు. 1988 వరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గంలో పని చేసి అనారోగ్యం వల్ల బాధ్యతల నుంచి తప్పుకున్నారు. 1994 నవంబర్ 27న కన్నుమూశారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యాలయాన్ని ఆయన పేరిట నామకరణం చేశారు.

లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి – పెనుమంట్ర

జగనన్న గృహ లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని తహశీల్దార్ దండు అశోక్‌వర్మ అన్నారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా ఓడూరు, నెలమూరు పరిధిలో ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు మండల స్థాయి అధికారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ వర్మ మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని, లేనిపక్షంలో వాటిని పరిశీలించి మరొకరికి అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడూరు సర్పంచి బుర్రా రవి కుమార్, నెలమూరు సర్పంచి కుచ్చర్లపాటి మంగతాయారు, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ, హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు కె.వెంకటపతిరాజు, వెంకటరామరాజు, పంచాయతీ రాజ్ ఎఇ నాగిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి : సబ్‌కలెక్టర్

పాలకొల్లు: విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ చెప్పారు. స్థానిక ఛాంబర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యం ఏర్పరుచుకుని దాన్ని నెరవేర్చుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహారావు, సెక్రటరీ కలిదిండి రామరాజు, ఛాంబర్ ఎడ్యుకేషనల్ నేతలు పాల్గొన్నారు.

ఆక్వా పరిశ్రమ వ్యర్థాలు కాలువలోకి వదలొద్దు

ఫ్యాక్టరీ వద్ద మత్స్యకారుల నిరసన

మొగల్తూరు: మొగల్తూరులోని వర్మ ఆక్వా మెరైన్ పరిశ్రమ నుంచి వ్యర్థాలు నేరుగా గొంతేరు కాలువలోకి వదలడం వల్ల మత్స్య సంపద నాశనం అవుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం మొగల్తూరులోని వర్మ ఆక్వా పరిశ్రమ వద్ద మత్స్యకారులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మొగల్తూరు పంచాయతీ పరిధి గంట పల్లపు పాలెం ముత్యాలమ్మ గుడి వద్ద వర్మ రొయ్యల పరిశ్రమ ఏర్పాటు చేశారన్నారు. పరిశ్రమలోని వ్యర్థాలు శుద్ధి చేయకుండా నేరుగా గొంతేరు కాలువకు వదలడంతో మత్స్య సంపద నశించిపోయి తమ జీవనోపాధి కోల్పోతామని తెలిపారు. వేట మీద ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందని అన్నారు. సంబంధిత అధికారులు పరిశ్రమను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ముత్యాలు వాటాల సుబ్బరాజు, తిరుమని సత్యనారాయణ, కొల్లాటి ఏడుకొండలు, బర్రి లక్ష్మణ స్వామి, మోకా శ్రీను, చింత ఏడుకొండలు, కర్రి సూర్యనారాయణ, తిరుమని నాగరాజు, రేవు ఏసుబాబు, మోకా రాంబాబు, వాటాల విజయభాస్కరరావు పాల్గొన్నారు.

భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం : పివిఎల్

ఉండి: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే జగనన్న భూ శాశ్వత హక్కు, భూ రక్ష ముఖ్యోద్దేశమని ప్రభుత్వ విప్, డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. భూరక్ష పథకంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నుకోబడిన పెదపుల్లేరులో శనివారం భూ శాశ్వత హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పివిఎల్ నరసింహరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పకడ్బందీగా భూ యజమాని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. భూ శాశ్వత హక్కు పత్రాలలో క్యూ ఆర్ కోడ్ ఉందని, దాన్ని సెల్ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే ఆ యజమాని సమగ్ర సమాచారం లభ్యమవుతుందని తెలిపారు. అనంతరం పెదపుల్లేరు గ్రామానికి చెందిన 187 మంది రైతులకు, కాళ్ల మండలం వేంపాడు గ్రామానికి చెందిన 174 మంది రైతులకు భూ శాశ్వత హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాయి రామలక్ష్మి, వైసిపి గ్రామ అధ్యక్షులు పప్పల రాంప్రసాద్, పెదపుల్లేరు రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్ కలిదిండి సీతారామరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సాంస్కృతిక వేడుకలు

ప్రజాశక్తి – నరసాపురం

విద్యార్థులు చదువులో రాణించాలని వైఎన్ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో సాంస్కృతిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు రుద్రరాజు రాణి ప్రారంభ ఉపన్యాసం చేశారు. కార్యక్రమానికి సంఘం పట్టణ అధ్యక్షులు ఎమ్‌డి జాన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులందరిలో నైపుణ్యం ఉంటుందని, దాన్ని సరైన విధంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బాలకుమారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.పెద్దిరాజు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాటాలతో పాటు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేసి, పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రవిరాం, సహాయ కార్యదర్శి టి.ప్రసాద్, పట్టణ కార్యదర్శి ఎ.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కరపత్రాలను పంపిణీ చేస్తున్న పివిఎల్

కాళ్ల: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. కలవపూడి సచివాలయ పరిధిలో మోదీ గ్రామంలో రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరాతీశారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అర్హులుంటే సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా గతంలో ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగేవారని, సిఎం చొరవతో నేరుగా ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకే చేరుతున్నాయన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 101 రోజులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలవపూడి సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, వేశ్వ జయ రామకృష్ణంరాజు, సాగిరాజు హరి వర్మ, తోటకూర సీతారామరాజు, మంతెన శివాజీ రాజు, ఎంపిటిసి నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

పురుషులతో సమాన హక్కు కల్పించాలి : ఐద్వా

ఆకివీడు: పురుషులతో సమానంగా స్త్రీలకు విద్య, ఉద్యోగం, ఆర్థిక సమానత్వం లభిస్తేనే స్త్రీకి సమాజంలో పూర్తి సమాన స్థానం లభిస్తుందని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ అన్నారు. స్త్రీ పురుషులు సమానం అనే అంశంపై శనివారం దుంపగడప డిగ్రీ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. మండల అధ్యక్షురాలు డోకల లక్ష్మి సెమినార్‌కు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు అణిచివేతకు గురవుతున్నారన్నారు. పురుషులతో సమానంగా ఆర్థిక సామాజిక రాజకీయ అవకాశాలు కనిపించడం లేదన్నారు. ఐద్వా మండల కార్యదర్శి సందక ఉదయ కుమారి మాట్లాడుతూ స్త్రీలకు సమాజంలో సమాన స్థానం లభించడం లేదన్నారు.

క్విజ్ పోటీల్లో ఆరవల్లి విద్యార్థుల ప్రతిభ

అత్తిలి : ఆరవల్లి విద్యార్థులు జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమని యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వామి, అప్పలరాజు అన్నారు. శనివారం ఆరవల్లి హైస్కూల్ విద్యార్థులు హేమశ్రీ, శంకర్, సత్యనారాయణ రెడ్డి ఈ నెల 26వ తేదీన తాడేపల్లిగూడెం శశి కాలేజీలో జరిగిన క్విజ్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించారు. వారిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను వారు అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కోసిన వెంటనే ధాన్యాన్ని కొనండి..

వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతుల డిమాండ్

ప్రజాశక్తి – వీరవాసరం

వీరవాసరంలో రోడ్డు పై ఆరబెట్టిన ధాన్యం

ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంట కోసిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో వాతావరణ మార్పులతో నష్టపోతామంటూ ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం 17 తేమ శాతంతో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అయితే వరికోత యంత్రాలతో కోతలు కోయడం వల్ల ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం తీసుకురావాలంటే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సాధ్యం కాదని రైతులు చెబుతున్నారు. ధాన్యం ఆరబెట్టడం వల్ల సమయం, ఖర్చులు పెరుగుతాయన్నారు. తేమ అధికంగా ఉంటే రేటు తగ్గించి ఇచ్చే విధంగా వెలుసుబాటు కల్పిస్తే అందుకు అభ్యంతరం లేదని అంటున్నారు. ఇప్పటికే అనేక రైసు మిల్లుల్లో ధాన్యం ఆరబోత యంత్రాలు ఉన్నందున తేమతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే గతానికి భిన్నంగా ప్రభుత్వం పలు శాఖల అధికారులను ధాన్యం కొనుగోలు పక్రియలో భాగస్వామ్యం చేసింది. అయితే సంబంధిత శాఖాధికారులు సమన్వయం చేసుకోవడంలో లోపాలు ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం ఆయా శాఖాధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యాచరణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమయంలో శాఖాధికారుల మధ్య సమన్వయం లోపం బయటపడింది. ఇదే సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. దాని ఫలితంగా వారి సమన్వయం లోపం ఇప్పటికీ కొనసాగుతున్నట్టు కనబడుతోంది. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రాథమిక పాత్ర పోషించి రైతుల వద్ద నుండి తేమ శాతం నిర్ధారణ కోసం నమూనా ధాన్యం సేకరించాల్సిన కొంత మంది వాలంటీర్ల నిర్లక్ష్యంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో టెక్నీషియన్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నమూనా ధాన్యం సేకరించాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. దీంతో కొనుగోలు ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. కొంత మంది వాలంటీర్లను సర్పంచులు, వైసిపి నాయకులు వెనకోసుకురావడంతో అధికారులకు తలనొప్పిగా మారిందంటూ వారు బహిరంగంగానే వాపోతున్నారు. అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలులో నూతన విధి విధానాలు పూర్తిగా రైతులకు చేరలేదు. దీంతో రైతులు నష్టపోయే పరిస్థితులున్నాయి. తేమ శాతంలో రైతులతో కొంత అనధికార అంగీకారం మేరకు కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ రైతులు మోసపోయే అవకాశలున్నాయని రైతులు మాటలను బట్టి తెలుస్తోంది. ఇప్పటికీ రవాణ ఖర్చులు, జట్టు కూలీ ఖర్చులు, రైతులే సంచులు సమకూర్చుకుంటే వాటికి చెల్లించే అద్దె వంటి విషయాలపై ఇప్పటికీ రైతులకు అవగాహన లేకపోవడం గమనార్హం. ఈ ఖర్చులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుందని అధికారులు ప్రకటించినప్పటికీ ఆ సమాచారం రైతులకు చేరకపోవడం గమనార్హం. గతంలో వలే ఖర్చులు భరించాల్సి వస్తుందని అనుకుంటున్నామంటూ రైతులు తెలిపారు. రైతుల అవగాహనలేమి వల్ల కొంత మంది ఆర్‌బికె సిబ్బంది రైతులకు రావాల్సిన ఖర్చులు తమ ఖాతాలోకి మళ్లించుకునే అవకాశం ఉందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో వీరవాసరంలో రైతుల ధాన్యం సొమ్మును ఆర్‌బికె సిబ్బంది తమ ఖాతాలోకి మళ్లించుకున్నారని, ఈ విషయం పైఅధికారులకు తెలిసినా వారిపై ఎటువంటి చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి పెట్టి రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



భీమవరం : ప్రతిజ్ఞ చేస్తున్న జెసి, అధికారులు

ప్రజాశక్తి – భీమవరం

అతిపెద్ద లిఖిత భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచిందని ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచడానికి రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరు కార్యాలయ ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి జెసి మురళి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో జెసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసిరాజు పాల్గొన్నారు.

వీరవాసరం: వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని బి.ప్రభామంజిరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ రమేష్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, వెంకటేశ్వరరావు, పంపన సాయిబాబు, ఫణికుమార్, పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆచంట: దేశంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రచించి దేశానికి అందించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ కొనియాడారు. శనివారం కొడమంచిలి పంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యల్లమిల్లి బేబీ రాజేష్, సొసైటీ ఛైర్మన్ కె. సత్యనారాయణ, ఉపసర్పంచి ములగాడ వరప్రసాద్, ఎఎంసి డైరెక్టర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల: భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా ఏలూరుపాడు, కాళ్ల, కాళ్లకూరు, సీసలి, జక్కరం, దొడ్డనపూడి, బొండాడ, కోపల్లె, పెదఅమిరంలో దళిత నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కోన జోసఫ్, సోడదాసి గంగయ్య, బందా ప్రసంగి, చిలకపాటి సుందర్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణలో భరత రాజ్యాంగం కీలక భూమిక పోషిస్తోందని వైఎన్ కళాశాల పీజీ డైరెక్టర్ ఎన్.చింతారావు అన్నారు. వైఎన్ కళాశాలలో శనివారం భారత రాజ్యాంగం దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో చింతారావు, కళాశాల డీన్ గంథం రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పీజీ విభాగం అధిపతి సుశీల్ పాల్, ఎంసిఎ విభాగ అధిపతి శ్యాంబాబు పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి నక్కా శ్యామలా సోనీ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మహంతి, వెంకటేశ్వరరావు, అంజలి, మల్లిక పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానం ఎడిఆర్, వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఇన్‌ఛార్జి ఎం.చారుమతి, సీనియర్ శాస్త్రవేత్త ,వ్యవసాయ పాలిటెక్నిక్ అకడమిక్ ఇన్‌ఛార్జి సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదట అంబేద్కర్ చిత్ర పటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన దేశ నాయకుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో పాఠశాల సహాయ ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణంరాజు, స్టాఫ్ సెక్రటరీ చింతపల్లి కృష్ణమోహన్ పాల్గొన్నార. పాతకాల సెంటర్ ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

పాలకొల్లు : రాష్ట్రంలో రాజ్యాంగం అమలు జరిగేలా చూడాలని ఎంఎల్ఎ ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్ఎ నిమ్మల, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ఆధ్వర్యంలో నేతలు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో న్యాయమూర్తులకు సైతం రక్షణ లేకుండా పోయిందన్నారు. గతంలో కడప జిల్లాలో మాత్రం రాజారావు రాజ్యాంగం అమలులో ఉండేదని, ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం లేకుండా ప్రజల హక్కులను కాల రాస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి బాలి ఏడుకొండలు, పెన్మెత్స రామభద్రరాజు, సత్యనారాయణ రాజు, వట్టం గణేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: రాజ్యాంగ దినోత్సవాన్ని శశి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా తాడేపల్లిగూడెం మొదటి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.అరుంధతి, రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సి.రమ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.నాగ మల్లీశ్వరి హాజరయ్యారు. అనంతరం కళాశాల డైరెక్టర్ కె.భాను ప్రకాష్, ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

ఉండి: అంబేద్కర్ అందరివాడని కెపిఎస్ నాయకులు మాదాసి గోపి అన్నారు. శనివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాందువ్వ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదించి నేటికి 73 సంవత్సరాలు పూర్తయ్యిందని, నేటికీ చాలా గ్రామాల్లో దళితవాడలు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో గోపాలం మాస్టారు, ఎం.ప్రశాంత్, డాక్టర్ రాంబాబు, ఎం.అర్జున్, పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వచ్చే ఏడాది సెలవుల జాబితా విడుదల

ఏలూరు సంయుక్త కార్మిక కమిషనర్ రాణి

ప్రజాశక్తి – భీమవరం

2023 సంవత్సరానికి గాను జాతీయ పండుగల సెలవుల జాబితాను విడుదల చేస్తున్నట్లు ఏలూరు సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి తెలిపారు. ఈ సెలవులు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు వర్తిస్తాయని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సెలవులకు సంబంధించి జిల్లాలోని అధికారులు, సంస్థలు, పరిశ్రమల యజమాన్యం, యూనియన్ ప్రతినిధులతో ఉమ్మడి సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర దుకాణాలులు, సంస్థలకు, ఫ్యాక్టరీలకు సంబంధించిన జాతీయ సెలవులు, పండుగ సెలవుల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ జాబితాను ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీ యాజమాన్యం వారు తప్పనిసరిగా ఆచరణలో పెట్టాలని పేర్కొన్నారు. జాతీయ సెలవులు వచ్చే ఏడాది జనవరి 26 రిపబ్లిక్ డే, మే 1న మేడే, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబర్ 2న గాంధీ జయంతి, పండుగ సెలవులు జనవరి 16న కనుము, ఏప్రిల్ 22న రంజాన్, సెప్టెంబర్ 18న వినాయక చవితి, నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవం, డిసెంబర్ 25న క్రిస్టమస్‌గా విడుదల చేసినట్లు తెలిపారు.

వ్యకాస రాష్ట్ర మహాసభ

డిసెంబర్ 8, 9, 10వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వ్యకాస నేతలు

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లను స్థానిక సుందరయ్య భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ డిసెంబర్ 8, 9, 10వ తేదీల్లో రాష్ట్ర మహాసభ జంగారెడ్డిగూడెంలో, ఆల్ ఇండియా మహాసభ 2023 ఫిబ్రవరిలో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని హౌరాలో జరగనున్నట్లు తెలిపారు. డిసెంబర్ ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెంలో జరిగే బహిరంగ సభలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు విజయ రాఘవన్, బృందా కారత్, కేరళ వ్యవసాయ శాఖ మంత్రి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగం, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ అమలు తీరుతెన్నులు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రానున్న మూడు సంవత్సరాల కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు ఈ మహాసభలు వేదిక కానున్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం సంస్కరణ పేరుతో దెబ్బతీస్తోందన్నారు. 1934లో మహానేత పుచ్చలపల్లి సుందరయ్య నిర్మించిన వ్యవసాయ కార్మిక సంఘం నేడు దేశవ్యాప్తంగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘంగా వ్యవసాయ కూలీల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం వ్యవసాయ కార్మిక సంఘమే అని అన్నారు. సంఘం రాష్ట్ర మహాసభకు అందరూ సహకరించి పెద్ద ఎత్తున ఎనిమిదో తేదీన జరుగుతున్న బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చినవీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు మరపట్ల దానయ్య పాల్గొన్నారు.

పేదల ఇల్లు కూలిస్తే ఉద్యమిస్తాం : సిపిఎం

ఆకివీడు: పేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేస్తే చూస్తూ ఊరుకునేది లేదని సిపిఎం హెచ్చరించింది. స్థానిక ఉప్పుటేరు దగ్గరలో రోడ్డు పక్కన నివాసముంటున్న వారి ఇళ్లను తొలగిస్తామంటూ జాతీయ రహదారుల అధికారులు జెసిబిలతో వచ్చారు. అయితే వారు ప్రతిఘటించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిని తాము ఎప్పటికీ అంగీకరించేది లేదంటూ సిపిఎం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సిపిఎం నాయకులు స్థానికులతో కలిసి కొద్దిసేపు అక్కడ శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ 80 సంవత్సరాలుగా అక్కడే నివాసం ఉంటున్న వారిని గుర్తించి వారికి భూ హక్కు పత్రాలను అందజేసి ప్రభుత్వ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. భూ హక్కు పత్రాలు ఇస్తామని చెప్పి వారం రోజులు తిరగకుండానే దౌర్జన్యంగా జెసిబిలతో వచ్చి ఇల్లు కూల్చి వేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. పేదల ఇళ్లను కూలిస్తే అంగీకరించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెంకి అప్పారావు, ఎస్‌కె వలీ, బొడ్డుపల్లి రాంబాబు, గేదెల ధనుష్ పాల్గొన్నారు.

కల్లు పాకను తొలగించొద్దు

గీత కార్మికుని దంపతుల ఆవేదన

ప్రజాశక్తి – ఆచంట

ఆవేదన వ్యక్తం చేస్తున్న గీత కార్మికుడు పెద్దిరాజు, మారెమ్మ దంపతులు

40 ఏళ్లుగా నిర్వహించుకుంటున్న కల్లుపాకను తొలగించొద్దని, తమకు న్యాయం చేయాలని కల్లుగీత కార్మికుడు బొంతు పెద్దిరాజు, మారెమ్మ దంపతులు అధికారులను వేడుకుంటున్నారు. శనివారం గీత కార్మికుని దంపతులు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడారు. ఆచంట వేమవరం శివారు నక్కల కాలువ రహదారిలో దేవ కాలువ, మురుగు టన్నెల్ పక్కన నాలుగు దశాబ్దాలుగా పూరిపాక వేసుకుని కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమకు ఐదుగురు ఆడపిల్లలని, నలుగురికి వివాహాలు చేశామని, మరో అమ్మాయికి వివాహం కుదిరిందని తెలిపారు. అయితే కల్లు కాంపౌండ్ వెనుకనున్న ఆక్వా చెరువులకు దారి ఇవ్వాలని తనపై ఒత్తిడి చేస్తూ చెరువు యాజమాని స్పందనలో ఫిర్యాదు చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు కూడా కల్లు కాంపౌండ్ ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఊరికి దూరంగా 40 సంవత్సరాల నుంచి కల్లు అమ్ముకుని జీవనోపాధి పొందుతుంటే అది చూచి వార్వలేక కేవలం వ్యక్తిగత కక్షతోనే స్పందన ఫిర్యాదు చేశారని ఆ దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. 40 ఏళ్లుగా ఎవరికీ ఇబ్బంది లేకుండా కల్లు కాంపౌండ్ నిర్వహించుకుంటున్న బొంతు పెద్దిరాజు, మారెమ్మల పూరి పాకను తొలగించాలని చూస్తే సహించేది లేదని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు బొంతు శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా బాధితులకు చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు వాసా రామ్మోహన్‌రావు, సిపిఎం నాయకులు సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, కొండేటి సత్యనారాయణ, కొండేటి రాఘవులు, స్థానికులు మద్దతు తెలిపారు.

వికలాంగుల పట్ల ప్రేమతో మెలగాలి : ఎస్ఐ

ప్రజాశక్తి – ఆచంట

వికలాంగుల పట్ల ప్రేమతో మెలగి, వారిలో ఆత్మవిశ్వాసం నింపాలని ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ తెలిపారు. ఆచంట వేమవరంలో బస్టాండ్ వద్ద వికలాంగుల హక్కుల పోరాట దినోత్సవానికి ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జి దిగమర్తి వెంకటేశ్వర రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ ప్రసాద్ పాల్గొని వికలాంగులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కనపాల పెద్దిరాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పోరాటం వల్ల వికలాంగులకు రూ.500 నుండి రూ.3 వేల వరకూ పెన్షన్ పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎఫ్ నాయకులు చదలవాడ సంపతరావు, విహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు తానేటి బుల్లియ, ఆకుమర్తి మోహన్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

పాలకొల్లు: ఉద్యోగులు ఐక్యంగా ఉండి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు గుడాల హరిబాబు కోరారు. ఏపీ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పాలకొల్లు యూనిట్ ఎన్నికలలో ఆసుపత్రి నుండి ఎన్నికైన సిబ్బందిని సత్కరించారు. స్టాఫ్ నర్స్ మధులత, సూపర్‌వైజర్ బాలచంద్రుడు, జూనియర్ అసిస్టెంట్ మురళీశశిధర్‌ను సత్కరించారు. ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి వేగేశ్న మురళీ కృష్ణంరాజు, కోశాధికారి డి.వి.రమణ, చిన్నమిల్లి గణపతి, చెన్ను విజయ్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌పై అవగాహన

నరసాపురం టౌన్ : స్థానిక వైఎన్ కళాశాలలో శనివారం నర్సాపురం ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు డ్రైవింగ్ లైసెన్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎపివి అప్పారావు, డీన్ గంథం శ్రీరామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డా. సిహెచ్. కనకా రావు, శ్రీ బి. వెంకట రత్నం, సుపెరిండెంట్ శ్రీ తోట ఏడుకొండలు, ఎన్. యస్. యస్. ఆఫీసర్ శ్రీ యస్. యోకబ్ పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్‌ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి – తణుకురూరల్

డ్యూటీ సర్టిఫికెట్ వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు కామన మునిస్వామి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలు నియామకం జరిగినప్పటి నుండి ఉద్యోగులను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోంబదని విమర్శించారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు జీతాలు పొందాలంటే తప్పనిసరిగా డ్యూటీ సర్టిఫికెట్ ఉండాలనే నిబంధన పెట్టారని, ఇది చట్ట వ్యతిరేక విధానామని తెలిపారు. అధికారులు వచ్చినప్పుడు ఉద్యోగులు లేని కార్యాలయాల్లో లేరనే కారణం చూపడం సరైనది కాదని తెలిపారు. సాధారణంగా ఒక శాఖ నుండి మరో శాఖకు వెళ్ళిన సందర్భంలో డ్యూటీ సర్టిఫికెటు ఇవ్వడం జరుగుతుందని, కాని సచివాలయంలోనూ వార్డుల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులందరికీ డ్యూటీ సర్టిఫికెట్ ఇమ్మని కర్నూలు మున్సిపల్ కార్యాలయం వారు సర్కిల్ విడుదల చేశారని, ఇది రాబోయే కాలంలో అన్ని మున్సిపాల్టీల్లో అమలు చేయడానికి ఇది ఒక ప్రయత్నమని మునిస్వామి తెలిపారు. జిఒను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ ఉద్యోగులను మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 634/2018, O.S. 329/2010
బిట్వీన్:
నాళం వెంకట లక్ష్మీనారాయణ
...పిటీషనరు /వాది
Vs
తమ్మినైన హరికృష్ణ (died)
తమ్మినైన లక్ష్మి
...రెస్పాండెంట్లు /ప్రతివాదు:
To:
రెస్పాండెంటు–2: శ్రీమతి తమ్మినైన లక్ష్మి, W/o. లేటు హరికృష్ణ, రామచంద్రరావుపేట, ఏలూరు, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా, ELR JCJC Limits.
పై నెంబరు దావాలో వాదిపై దివి. 9-4-2018 సం॥లో I.A. 593/2012 మరియు దావాలో శ్రీ కోర్టు వారు Pass చేసిన default order ను రద్దుచేసి పిటీషనును, దావాను restore చేయించమని వాది దాఖలు చేసిన పై నెంబరు I.A. 634/2018 పిటీషనులో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక బుద్ధిపూర్వకంగా avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి వుత్తర్వుల ప్రకారం యీ పేపరు ప్రకటన యివ్వబడినది. కాబట్టి దివి. 07-12-2022 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ లగాయితూ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
కె.వి.వి.హరిమోహన్
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు | కొవ్వూరు
21-11-22 | సెల్: 9160061613

మార్కుల లిస్ట్ పోయినది
పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం మండలం, కొణితివాడ గ్రామంలో నివాసం ఉంటున్న యరకరాజు రుక్మిణి, తండ్రి: సూర్యనారాయణ అను నేను కొణితివాడ హైస్కూల్లో 1972-1973 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్నాను. రోల్ నెంబర్ 44733, అడ్మిషన్ నెంబర్ 807. ఈ నెల 19 వ తేదీన జిరాక్స్ నిమిత్తం షాప్‌కి వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. కావున దొరికిన వారు ఈ నెంబర్‌కు అందజేయగలరు.
యరకరాజు రుక్మిణి
నాగరాజు చెరువు వద్ద, కొణితివాడ, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
సెల్ నెంబర్ : 94409 73366